క్లుప్తంగా

సాగునీటి కాలువలోకి మురుగునీరు


కలుషితమైన సాగునీటి కాలువ నీరు

పూసపాటిరేగ: మండలంలోని కనిమెట్ట సమీపంలో జాతీయ రహదారి ఆనుకుని ఉన్న సాగునీటి కాలువలోకి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మురుగునీరు విడిచిపెట్టిన ఘటన సోమవారం వెలుగు చూసింది. ఇదే నీరు చెరువులో కూడా కలుస్తుండడంతో చెరువు కలుషితం కాకుండా రైతులు అప్రమత్తమయ్యారు. కాలువలోని వ్యర్థాలు చెరువు నీటిలో కలవకుండా కాలువకు అడ్డంగా గ్రావెల్ వేసి నీటి ప్రవాహాన్ని ఆపారు. అధికారులు స్పందించి, జల కాలుష్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత


బాధితుడికి ఆర్థికసాయం చేస్తున్న బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: నిరుపేద బ్రాహ్మణులకు అండగా ఉంటామని బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ప్రచార కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం మండలం, వెంకటాపురానికి కొడుకుళ్ల వెంకట సూర్యనారాయణ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా, ఆయనకు రూ.40 వేలు సోమవారం అందజేశారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ సూచనలతో వెంకట సూర్యనారాయణను పరామర్శించి, ఆర్థికసాయం చేయడం జరిగిందన్నారు.

డీఎస్సీ మోడల్ పరీక్షకు విశేష స్పందన


విజయనగరం అర్బన్: స్థానిక కస్పా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డీఎస్సీ మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. తొలుత మోడల్ ప్రశ్నాపత్రాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 200 మంది హాజరయ్యే ఎస్జీటీ కేటగిరీ పరీక్షను మాన్యువల్‌గా స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డీ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు మంజూరు చేయాలి


డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: పట్టణంలోని నిరుపేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.రంగరాజు కోరారు. ఇదే విషయమై ఆయన పలువురు నిరుపేదలతో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డీటీ సంతోషికుమారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో పట్టణంలోని నిరుపేదలతో ఇళ్ల కోసం దరఖాస్తు చేయించామని, ఇంతవరకు వాటిపై స్పందన లేదన్నారు. ఇప్పటికైనా చొరవ తీసుకుని పేదలకు ఇళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎన్.నాగభూషణం, బి.వాసు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

గతంలో 14 మందికి..


నెల్లిమర్ల: తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

నెల్లిమర్ల: అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లస్థలాలు మంజూరుచేయాలని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో తహసీల్దారు సుదర్శనరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నగరపంచాయతీ పరిధిలో గత ప్రభుత్వం 1400 మంది పేదలకు నివాసయోగ్యం కాని స్థలంలో ఇళ్లపట్టాలు ఇచ్చిందని, అక్కడికి నిర్మాణ సామగ్రి తీసుకువెళ్లలేక నిర్మాణాలు చేసుకోలేదన్నారు. వారందరికీ మళ్లీ నివాసయోగ్యమైన స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పట్టాలు ఇవ్వాలని కోరారు.

కోనేరు కంపు కొడుతోంది..

- వ్యర్థాలతో నిండిన కోనేరు పరిసరాలు
- వాకింగ్ ట్రాక్‌లో పేరుకుపోయిన అపారిశుధ్యం
- విరిగిపడిన బెంచీలు, ప్రహరీ
- వర్షం పడితే చిత్తడి చిత్తడిగా రోడ్డు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

విజయనగరం: నగరం నడిబొడ్డున..వందల ఏళ్ల చరిత్ర కలిగినది..రాజుల పాలనలో నిర్మించినది.. అయ్యకోనేరు. అంతటి గొప్ప పేరు కలిగిన ఈ కోనేరు పరిస్థితి ఇప్పుడు దయనీయంగా మారింది. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో ఓ వెలుగు వెలుగొందిన ఈ కోనేరు ఇప్పుడు నిర్లక్ష్యానికి గురవుతోంది. కనీస అభివృద్ధి చర్యలకు నోచుకోవడం లేదు. ఫలితంగా కోనేరు పరిసరాల్లో అపారిశుధ్యం పేరుకుపోయింది. ఎక్కడా చూసినా చెత్తాచెదారమే కనిపిస్తోంది. దీనికి తోడు విరిగిన బెంచీలు, ప్రహరీ గోడలే తారసడుతున్నాయి. అయినా అధికారులు తమకేదీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.


కోనేరులో పేరుకుపోయిన వ్యర్థాలు

నేతలు, అధికారులు వస్తారంటేనే చర్యలు..

ఏటా వినాయక చవితి ఉత్సవాల్లో గణేశుని నిమజ్జనాలు ఇదే కోనేరులో జరుగుతాయి. ఒకప్పుడు ఎంతో ఆహ్లాదకరంగా ఉండే ఈ కోనేరుకు కాపలాగా ముగ్గురు వాచ్‌మన్‌లను గతంలో నియమించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తున్నారంటేనే మున్సిపల్ వర్కర్లు ఇక్కడ కనిపిస్తుంటారు. వారు వస్తారని చూస్తారని కోనేరు పరిసరాలు శుభ్రం చేసి, బ్లీచింగ్ జల్లుతారు. వారు చూసి వెళ్లిన తర్వాత అస్సలు పట్టించుకోరు. అధికారులదీ ఇదే తీరు కావడంతో ప్రస్తుతం కోనేరు అపరిశుభ్రంగా తయారైంది.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కలెక్టరు హరిజవహర్ లాల్ ఇక్కడి ఆక్రమణలు తొలగించి, చెరువు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. చెరువు చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి, లారీల్లో మట్టి తీసుకువచ్చి వేయించారు. అప్పటి జిల్లా నాయకులు, అధికారుల సహాయ సహకారాలతో అయ్యకోనేరుకు ఓ చక్కని రూపు తీసుకువచ్చారు. కోనేరు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేలా ఓ స్టేజి కూడా ఏర్పాటు చేశారు. అంతేగాక చెరువు వ్యూ చూసేందుకు వ్యూ పాయింట్ కూడా నిర్మించారు. కానీ ఇప్పుడా ప్రగతి జాడలేవీ కనిపించడం లేదు.

చేపల వ్యర్థాలతో దుర్వాసన..

చేపల వ్యర్థాలతో కోనేరును కంపు కొట్టేలా చేస్తున్నారు. చెరువులో చనిపోయే చేపలను ఈ కోనేరులో వదిలేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇక చెరువు పక్కనే ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్ల పరిస్థితి అయితే మరీ దారుణం. అవి అధ్వానంగా ఉండడంతో అటువైపు తల తిప్పడానికి జనం భయపడుతున్నారు. ఇలా అయితే ఎలా అని నగరవాసులు, వాకింగ్‌కి వచ్చేవారు ప్రశ్నిస్తున్నారు. నిర్లక్ష్యం చేయకుండా అభివృద్ధి బాటపట్టించాలని కోరుతున్నారు.

భరించలేని దుర్గంధం..

అయ్యకోనేరు చుట్టూ ఆలయాలే. కానీ అక్కడి వ్యర్థాల భరించలేని దుర్గంధం వస్తోంది. కోవెలకి వెళ్లి మనస్ఫూర్తిగా దండం పెట్టుకుందామంటే ముక్కులదిరిపోతున్నాయి. మనశ్శాంతి కోసం వెళ్తే ఒక్క క్షణం కూడా ఉండలేకపోతున్నాం.

–ఎం.రవి, స్థానికుడు

వర్షమొస్తే బురదమయం..

ఏ చిన్నపాటి వర్షం కురిసినా వాకింగ్ ట్రాక్ బురదమయమవుతోంది. వాకింగ్ చేద్దామంటే భయమేస్తోంది. ఎక్కడ జారిపడతామేమోనని. కొన్నిచోట్ల వరద నీరు నిల్వ ఉండిపోతోంది. అధికారులు స్పందించి, కోనేరు పరిశుభ్రతా చర్యలు చేపట్టాలి.

–సీతారామరాజు, వాకర్


వర్షపునీటితో వాకింగ్ ట్రాక్


విరిగిన వాకింగ్ ట్రాక్ గోడ


అధ్వానంగా సామూహిక మరుగుదొడ్లు


కోనేరు పరిసరాల్లో విరిగిన బెంచీలు


చిన్న వర్షానికి బురదమయంగా వాకింగ్ ట్రాక్

కాలువ కప్పేశారయ్యా..చర్యలు తీసుకోండి!



పంట కాలువ కప్పేశారని, చర్యలు తీసుకోవాలని పూసపాటిరేగ మండలం, సీహెచ్ అగ్రహారం గ్రామ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు తాడ్డి గోవిందకు వినతిపత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 60లోని పొలాల్లో ఉన్న కాలువను కొంతమంది రియల్ ఎస్టేట్ యజమానులు కప్పివేశారని ఫిర్యాదు చేశారు. ఆ కాలువ ద్వారానే చెరువు నీరు బయటకు వెళ్లాలని లేకపోతే గ్రామం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వి.జయరాం, మాజీ సర్పంచ్ పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

–పూసపాటిరేగ

రేషన్ డిపో తరలింపుపై ఫిర్యాదు



రేషన్ డిపోను వేరే గ్రామం తరలించడంపై నెల్లిమర్ల మండలం, తుమ్మాపురం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై మండల కేంద్రానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు సుదర్శనరావును సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. డీలర్ గోవింద్.. తమ గ్రామంలో నిర్వహించాల్సిన రేషన్ షాపును ఆల్తిపాలెంకు మార్చేశారని, రేషన్ తీసుకోవాలంటే మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. తమదే పెద్ద గ్రామమని, తమ గ్రామంలోనే రేషన్‌కార్డుదారులు ఎక్కువ మంది ఉన్నారని, ఆ గ్రామం తరలించడం వెనక ఉద్దేశమేంటన్నది తెలియరావడం లేదన్నారు. అధికారులు జోక్యం చేసుకుని, రేషన్ దుకాణం తమ గ్రామం వచ్చేలా చూడాలని కోరారు.

–నెల్లిమర్ల

గ్రాట్యుటీ బకాయిలు చెల్లించాలి



కార్మికులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలని బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు ఎం.ప్రసాద్, కె.పద్మనాభం, కె.రామారావు, ఎం.పాపారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు నెల్లిమర్ల మండల కేంద్రానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు సుదర్శనరావును కలిసి విజ్ఞప్తి చేశారు. స్థానిక జూట్‌మిల్లు కార్మికుల బకాయిలు చెల్లించాలని లేబర్ కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ యాజమాన్యం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు కలెక్టరు ఆదేశాలున్నా మీరెందుకు యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం లేదని తహసీల్దారును ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళన బాటపడతామని హెచ్చరించారు. కార్మికులను, యాజమాన్యాన్ని పిలిపించి మాట్లాడతానని తహసీల్దారు హామీఇచ్చారు.

–నెల్లిమర్ల

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేద్దాం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


విజయనగరం: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో పార్టీ పార్లమెంటరీ జిల్లా పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ, పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులంతా జెడ్పీ చైర్మన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పదవులు రావడం వెనక ఆయన కృషిని ప్రశంసిస్తూ సన్మానించారు. పార్టీని నమ్ముకున్న వారికి పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందనడానికి తమకు వచ్చిన ఈ పదవులే నిదర్శమని, రానున్న రోజుల్లో పార్టీ మరింత అభివృద్ధికి పాటుపడతామన్నారు. జెడ్పీ చైర్మన్ కూడా వారిని అభినందిస్తూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. మరింత బాధ్యతగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి చురుగ్గా తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస్‌నాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు వై.వాసునాయుడు, కల్చరల్ విభాగం అధ్యక్షుడు బలివాడ నరేంద్రకుమార్, ఐటీ వింగ్ అధ్యక్షుడు గంధవరపు హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ చైర్మన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు, తదితరులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నెల్లిమర్ల రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దారు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామతీర్థం గ్రామంలో యోగాపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కల్యాణ వేదిక ప్రాంగణంలో అధికారులు, సిబ్బంది యోగసనాలు సాధన చేసి, వాటి ప్రయోజనాలు వివరించారు. ప్రస్తుతం ఉరుకులు, పరుగుల జీవితంతో ప్రజలు మానసిక ప్రశాంతతకు దూరమవుతున్నారని, తద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఒత్తిడి అధిగమించేందుకు యోగా చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుదర్శనం, ఈవోపీఆర్డీ శంకర జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: యోగాతో ఆరోగ్యవంతమైన సమాజానికి పాటుపడాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్రలో భాగంగా స్థానిక మెసానిక్ టెంపుల్ వద్ద యోగాసనాలు సోమవారం సాధన చేశారు. అనంతరం మయూరి జంక్షన్ వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ యోగా ప్రొఫెసర్ ఇందుమతి యోగాసనాల ఆవశ్యకతను వివరిస్తూ యోగా శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత కమిషనర్ మాట్లాడుతూ నెల రోజుల పాటు యోగా కార్యక్రమాలు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


నెల్లిమర్ల రూరల్: రామతీర్థం కల్యాణ వేదిక వద్ద యోగాసనాలు సాధన చేస్తున్న సిబ్బంది

వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పూసపాటిరేగ: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు మండల కేంద్రంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఓ ప్రకటనలో సోమవారం కోరారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగిస్తుండడాన్ని వెన్నుపోటుగా భావిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలన్నారు. పోస్టాఫీసు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని, ఆ తర్వాత తహసీల్దారుకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు.


మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: పూసపాటిరేగ మండల కేంద్రంలో ఈ నెల 4న జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు ఓ ప్రకటనలో సోమవారం కోరారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుండడాన్ని ఎండగడుతూ చేసే ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలంతా తరలిరావాలన్నారు.

పూసపాటిరేగ: మండల కేంద్రంలో ఈ నెల 4న జరగబోయే వెన్నుపోటు దినం కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: స్థానిక బొండాడ వీధిలో మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేసి, 108 చీరలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ధర్నా



విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట కౌలురైతులు సోమవారం ధర్నా చేశారు. ఏపీ కౌలురైతు సంఘం, విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భూ యజమాని సంతకంతో పని లేకుండా కౌలుకార్డులు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు, ఇతర రాయితీలు కల్పించాలని కోరారు. అలాగే అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న జామి గ్రామ రైతు గొర్లె ఎర్రన్నాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి కసిరెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం ఫోర్ట్

విద్యాహక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కేస్తున్నారు..

విజయనగరం గంటస్తంభం: జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలు.. విద్యాహక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జేసీ సేతు మాధవన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి డి.రాము, సీహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పుస్తకాల వ్యాపారం మొదలైందని, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పెద్దఎత్తున ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల ద్వారానే చదువు చెప్పాలని ఉన్నా సరే అనేక ప్రైవేటు విద్యాసంస్థలు సొంతంగా పుస్తకాలు ముద్రించి రూ.వేలకు రూ.వేలు వసూలు చేస్తున్నాయన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రతి పాఠశాలలోనూ పుస్తకాల అమ్మకాలపై నిషేధం విధిస్తూ నోటీస్ బోర్డులో నోటీస్ పెట్టాలని కోరారు. పుస్తకాలు ఎక్కడైనా కొనుక్కోవచ్చనే అంశాన్ని అందులో పొందుపరచాలన్నారు. విద్యాశాఖ అధికారులను పేరెంట్స్ కాంటాక్ట్ అయ్యేలా టోల్‌ఫ్రీ నంబర్ ఇవ్వాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యాల నాయుడు కూడా కార్పొరేట్ విద్యాసంస్థల పర్యవేక్షణలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఆయనపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


జేసీ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు